వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 48
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
నవంబర్ 05, 2024
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



8లో..

## అతిథి అధ్యాపకురాలికి బ్రెయిన్ స్ట్రోక్

- ఉద్యోగం పోతుందనే ఆందోళన
- యువతి పరిస్థితి విషమం



## సుబ్రహ్మణ్యేశ్వరుడిగా.. సిద్దేశ్వరుడు

కార్తీక మాసం మంగళవారం నాగుల చవితి సందర్భంగా హనుమకొండ జిల్లా పద్మాక్షి రోడ్ లోని సిద్దేశ్వర స్వామి దేవాలయంలో కొలువై ఉన్న సిద్దేశ్వరుడిని సుబ్రహ్మణ్యేశ్వరుడిగా ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

–వరంగల్ వాయిస్, హనుమకొండ



2లో..

## ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్
- హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా

వివరాలు 2లో..



# కాంగ్రెస్‌లో.. పచ్చ పెత్తనం

కాంగ్రెస్ పార్టీలో పసుపు పెత్తనం ఎక్కువైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా టీడీపీ నుంచి వలస వచ్చిన వారే ఆధిపత్యం చెలాయించడంపై అసలైన కాంగ్రెస్ వాదులు భగ్గుమంటున్నారు. పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు అహర్నిశలు కష్టపడిన నాయకులు, కార్యకర్తలను గాలికొదిలేస్తూ పసుపు పచ్చ జెండా మోసిన వారికే అగ్ర తాంబూలం ఇస్తున్నారని మండిపడుతున్నారు. గతంలో బీఆర్ఎస్ కూడా పార్టీ కోసం పనిచేసిన వారిని కాకుండా టీడీపీ నుంచి వలస వచ్చిన నాయకులనే నెత్తిన పెట్టుకుంది. ఇప్పుడు కార్యకర్తలు, నాయకుల కష్టంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా అదే తోవలో నడుస్తోంది. ప్రభుత్వ పటిష్టత కోసం అంటూ బీఆర్ఎస్, గత టీడీపీ నేతలను పార్టీలో చేర్చుకుంటూ సొంత పార్టీ నేతలను విస్మరిస్తున్నారు. అయితే వలసవాదులపై చూపుతున్న ఆస్తకిలో కొంత మేర కూడా సొంత పార్టీ కార్యకర్తలు, నాయకుల కష్టాన్ని గుర్తించడంలో చూపడం లేదనే విమర్శలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. ఇతర పార్టీలనుంచి వచ్చే జంప్ జిలానీలకే పదవులు కట్టబెడుతూ అందలమెక్కిస్తున్నారనే అపవాదు కూడా కాంగ్రెస్ కూడకట్టుకొంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే గత బీఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే కాంగ్రెస్ కు పట్టక తప్పదని సొంత పార్టీ కార్యకర్తలే బాహాటంగా విమర్శిస్తున్నారు.

-వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి

- వలసలకే ప్రాధాన్యం
- వారికే పదవులు
- పెరుగుతున్న అసంతృప్తి
- బీఆర్ఎస్ దారిలోనే హస్తం పార్టీ
- తీరు మారకుంటే తీవ్ర నష్టమంటున్న స్వపక్ష నేతలు

8లో..

## త్వరలో ఎయిర్ పోర్ట్





- 2050-విజన్‌తో మాస్టర్ ప్లాన్
- జిల్లా ఇంఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- వరంగల్ అభివృద్ధిపై విస్తృత స్థాయి సమావేశం

# కాంగ్రెస్ లో.. 'పచ్చ' పెత్తనం



- వలసలకే ప్రాధాన్యం
- వారికే పదవులు
- పెరుగుతున్న అసంతృప్తి
- బీఆర్ఎస్ దారిలోనే హస్తం పార్టీ
- తీరు మారకుంటే తీవ్ర నష్టమంటున్న స్వపక్ష నేతలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు సంవత్సరం కావస్తున్నా పార్టీ పటిష్టతకు కష్టపడిన కరుడు గట్టిన కాంగ్రెస్ వాదులకు గుర్తింపు లభించడం లేదనే ఆవేదన, అసంతృప్తి సగటు కాంగ్రెస్ కార్యకర్తలో వ్యక్తమవుతోంది. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో నిర్బంధాలు, అరెస్టులు, అక్రమ కేసులను ఎదుర్కొని కాంగ్రెస్ గెలుపు కోసం కష్టపడితే టీడీపీ పార్టీ నుంచి వలస వచ్చిన నేతలను అక్కున చేర్చుకొని సొంత పార్టీ కార్యకర్తలను రోడ్డున పడేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై కాంగ్రెస్ కార్యకర్తల పరిస్థితి కడుపు చించుకుంటే కాలు మీద పడ్డట్టుగా మారింది. గతంలో బీఆర్ఎస్ పార్టీ కూడా టీడీపీ నేతలకే అధిక ప్రాధాన్యం ఇస్తూ సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలను పక్కనబెట్టడం పలు విమర్శలకు కారణమైంది. ఇదే బీఆర్ఎస్ పార్టీ కాలగర్భంలో కలిసి పోవడానికి కూడా కారణంగా చెప్పుకొంటున్నారు. అదే పరిస్థితి ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీలోనూ కనిపిస్తోంది. కాంగ్రెస్ ను అధికారంలోకి తెచ్చేందుకు కష్టపడిన కార్యకర్తలు, నేతలకు ఇప్పుడు సొంత పార్టీలోనే చేదు అనుభవం ఎదురవుతోంది. దీంతో ఆయా నేతలకు ఏమీ చేయాలో పాలుపోవడం లేదు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలితో ఇప్పటికే పలువురు సీనియర్ నేతలు బహిరంగంగానే విరమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతున్నా.. పార్టీ తీరు మాత్రం మారడం లేదు.



### పసుపు మయం..

కాంగ్రెస్ పార్టీ అంతా టీడీపీ మయంగా మారిందని కాంగ్రెస్ వాదులు అంతర్మథనానికి గురవుతున్నారు. పుట్టినప్పటి నుంచి కాంగ్రెస్ లో పనిచేసిన నేతలను కాదని టీడీపీ, బీఆర్ఎస్ నుంచి వలస వచ్చిన నేతలకే కాంగ్రెస్ హైకమాండ్ ప్రాధాన్యం ఇవ్వడంపై ఇప్పటికే ఆ పార్టీకి చెందిన సీనియర్ నేతలు పదే పదే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా.. ఆ పార్టీ తీరులో చలనం రావడం లేదు. సాక్ష్యాత్తు సీఎం రేవంత్ రెడ్డినే టీడీపీ నుంచి వలస వచ్చాడని కాంగ్రెస్ వాదులు విమర్శించిన దాఖలాలూ ఉన్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ క్యాబినెట్ లో కూడా టీడీపీ నేతలకే ఎక్కువ ప్రయారిటీ ఉందనే వాదన కూడా వినిపిస్తోంది. అలాగే, నామినేటెడ్ పోస్టులు కూడా టీడీపీ నుంచి వచ్చిన వారికే దక్కుతున్నాయనే ఆక్రోషం సీనియర్ కాంగ్రెస్ వాదుల్లో వ్యక్తమవుతోంది. రాజు మనోడైతే.. పదవులకు కొదవ ఉండదన్న తీరు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతుందని ఒరిజినల్ కాంగ్రెస్ వాదులు సీఎంపై గుర్రుగా ఉన్నారు.

### జీవన్ రెడ్డి ఘటనే తార్కాణం...

జగిత్యాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న, చేరిన ఇతర పార్టీల నేతలపై రోడ్డెక్కిన సంగతి అందరికి తెలిసిందే. మొదటి నుంచి ఆయన జంప్ జిలానీలను తీవ్రంగానే వ్యతిరేకిస్తున్నారు. తన నియోజకవర్గంలో తనకు తెలియకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేను కాంగ్రెస్ పార్టీలో ఎలా చేర్చుకుంటారని గతంలో ఆయన బాహాటంగానే ప్రశ్నించారు. అది పక్కన పెడితే తాజాగా జరిగిన ఘటన కాంగ్రెస్ పార్టీలో ప్రకంపననే సృష్టించింది. సొంత పార్టీ కార్యకర్తనే చంపితే రక్షణ లేకపోతే సామాన్య జనాలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో రక్షణ ఏదీ అంటూ ఆయన ప్రశ్నించిన తీరు యావత్ కాంగ్రెస్ కార్యకర్తల మనసులను తొలిచింది. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం, హైకమాండ్, పీసీసీ నుంచి సరైన సమాధానం దొరకలేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతోంది. వలసలను ప్రోత్సహిస్తే మొదటికే మోసం వస్తుందని జీవన్ రెడ్డి భయపడ్డట్టే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ పరిస్థితి మారిందనడంలో సందేహం లేదు.

### కార్యకర్తల మనోవేదన..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా తమకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వడం లేదని, ఒరిజినల్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నుంచి వచ్చిన వారికే రెడ్ కార్పెట్ పరుస్తూ పదవుల్లో వారికో ప్రాధాన్యం కల్పించడంతో నిజమైన కాంగ్రెస్ పార్టీ నేతల్లో అసహాయం వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా నామిటేడేట్ పోస్టుల్లో కూడా తమకు ప్రాధ్యాన్యం దక్కడం లేదని వారిలో వారే రగిలిపోతున్నారు. పార్టీ పటిష్టత, గెలుపు కోసం అహోరాత్రులు కష్టపడి పనిచేస్తే తమకు మిగిలింది కన్నీరే అని తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. పరిస్థితి ఇలానే కొనసాగితే నాయకులు, కార్యకర్తలు అసంతృప్తి జ్వాలలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం, అధిష్టానం, సీఎం రేవంత్ రెడ్డి మాడి మసైపోవడం గ్యారెంటీ అంటూ హెచ్చరిస్తున్నారు.

## ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్
- హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్లను, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో వరంగల్ తొలి మేయర్, మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ పాల్గొన్నారు. మహాధర్నాకు మద్ధతుగా వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి పలువురు నేతలు మంగళవారం నన్నపునేని నరేందర్ తో కలిసి హైదరాబాద్ కు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ ఆటో కార్మికులకు అండగా ఉంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల పొట్టకొట్టిందని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయంతో లక్షలాది మంది ఆటో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ఆటో కార్మికులకు నెలకు రూ.12 వేలు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. మృతి చెదిన ఆటో కార్మికులకు రూ.20 లక్షల పరిహారం అందించాలన్నారు. ఈ సందర్భంగా ఆటోలో ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ తో కలిసి ఆటోలో ప్రయాణించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకులు, వరంగల్ తూర్పు ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు సంజీవ, శ్రీధర్ రెడ్డి, సంజీవ్, బాబు సదానందం, స్వామి, జయరాం, యాకుబ్, రమేష్, శివ, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి గింజా కొనాలి

- మద్దత్తు ధరతో పాటు బోనస్ చెల్లించాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి డిమాండ్



**వరంగల్ వాయిస్, దేవరుప్పల :** ఆరు గాళాలు రైతుల కష్టపడి పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనాలని, మద్దత్తు ధరతో పాటు బోనస్ చెల్లించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్ చేశారు. మంగళవారం దేవరుప్పుల మండల కేంద్రానికి వెళుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వాహనాన్ని మార్గ మధ్యంలో కొందరు రైతులు నిలిపివేసి తమ గోడును వెళ్ళబోసుకున్నారు. దీంతో వాహనం దిగిన ఆయన వరి కల్లాలను పరిశీలించారు. తాము పండించిన పంటకు ఈ ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వకపోగా, కనీసం మద్దతు ధర కూడా ఇస్తలేదంటూ మొర పెట్టుకున్నారు. దీంతో స్పందించిన ఎర్రబెల్లి పండిన ప్రతీ గింజ కోనేవరకు ఈ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కచ్చితంగా ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. అదే విధంగా కాంగ్రెస్ ప్రకటించినట్లు బోనస్ కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయాలన్నారు. ఎర్రబెల్లి దయాకర్ రావు వెంట మండల పార్టీ నాయకులు, గ్రామ నాయకులు ఉన్నారు.

# కుల గణనలో బీసీలంతా పాల్గొనాలి

**ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసిన సీఎంకు కృతజ్ఞతలు**

**బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక జిల్లా ప్రెస్ క్లబ్ లో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చేసిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ మాట్లాడుతూ నవంబర్ 6 నుంచి 21 వరకు తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న సమగ్ర కులగణనలో బీసీలంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. బీసీలకు రిజర్వేషన్ల పై ప్రత్యేక కమిషన్ నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డికి బీసీల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. రేపటి నుంచి చేపట్టనున్న కుల గణనలో బీసీలంతా ఎలాంటి సందేహాలకు, అపోహలకు తావు లేకుండా స్వచ్ఛందంగా పాల్గొని అధికారులు అడిగే దాదాపు 75 ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పాలన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరు మీ కులం, ఉప కులం వివరాలను కచ్చితంగా తెలియజేయాలని పిలుపునిచ్చారు. అలాగే కులగణన సర్వే ఒక నెలలో పూర్తి అయ్యిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాడి మల్లయ్య యాదవ్, బచ్చు ఆనందం, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి భీమగాని యాదగిరి గౌడ్, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల సంపత్ కుమార్, బీసీ మహిళ నాయకురాలు మాధం పద్మజ దేవి, మాదిశెట్టి అరుంధతి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు కాసగాని అశోక్ గౌడ్, పంజాల మధు, దాడి రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

# ఇంటింటి సర్వేకు సహకరించాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం పరకాల మున్సిపల్ పరిధిలోని 6వ, 7వ, 20వ వార్డులలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కుల జనగణ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రతి ఒక్కరూ సహకరించి విజయవంతం చేయవలసిందిగా పరకాల మున్సిపల్ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ అన్నారు. వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందని, ప్రజలందరికీ సమాన హక్కులను అందేటట్టుగా ప్రభుత్వ పథకాలు అందరికీ అందేటట్టుగా ఈ కార్యక్రమం తోడ్పడుతుందని ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 6, 7, 20 ఈ మూడు వార్డులలో 7వ వార్ మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

# గ్యారెంటీలు, హామీల సంగతేంటీ..?

**కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీజేపీ**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్యారెంటీలు, హామీల ఊసెత్తితే.. తిమ్మికేస్తే బమ్మికి, బమ్మికేస్తే తిమ్మికేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వమని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ విమర్శించారు. వరంగల్, హనుమకొండ జిల్లాల ఉపాధ్యాయులు మంగళవారం హనుమకొండ ఏకశిలా పార్కు వద్ద పెండింగ్ లో ఉన్న డీఏ- పీఆర్సీల బిల్లులు తక్షణమే పరిష్కారం చేయాలంటూ చేపట్టిన ధర్మాగ్రహ దీక్షకు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ ధర్నాలో వారితో పాటు బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షులు బలరాం, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు నిశిధర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఏలవట్టి ఏడాది ఐన ఆర్థికపరమైన ఎలాంటి ప్రయోజనం కలగలేదని, అలాగే ఇప్పటివరకు బకాయి పడ్డ నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, ఈ-కుబేర్ లో ఉన్న పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, పీఆర్సీ కమిటీ రిపోర్టు తెప్పించుకొని అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఘనంగా ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్సవం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నారాయణ హై స్కూల్ వరంగల్ ఒలంపియాడ్ బ్రాంచ్ నక్కలగుట్టలో పాఠశాల ప్రిన్సిపాల్ వంగల అలేఖ్య ఆధ్వర్యంలో మంగళవారం నారాయణ ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డీజీఎం రిజ్వానా మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థి మానసిక, శారీరక ఆరోగ్యం ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో క్రీడ పోటీలలో పాల్గొని ప్రసంగించారు. క్రీడలలో గెలుపు ఓటములు అనేది సహజమని తెలుసుకోవాలని విద్యార్థులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీజీఎం రిజ్వానా, ప్రిన్సిపల్ వంగల అలేఖ్య, కోఆర్డినేటర్స్ సాయి కృష్ణ, హారిక, శిరీష, అకాడమీ డీన్ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపల్స్ షాహిని, కరుణశ్రీ, ఏవో నాగరాజు, పీఈటీ చిర్ర సుమన్ గౌడ్, తదితర ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష చేపట్టారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు. తెలంగాణ ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెండింగ్ లో ఉన్న డీఏ బకాయిలు, బిల్లులు, పీఆర్సీ అమలు చేస్తామని ప్రకటించిన నేటికి అమలు కాలేదన్నారు. జీవో 317 బాధితులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవనీ, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారి సొంత జిల్లాలకు వెళ్లేలా చూడాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. లేకుంటే రానున్న రోజుల్లో రాష్ట్ర స్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో సూపరిండెంట్ కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిబోయిన గోపికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు వొమ సంతోష్, అమరగొండ మహేందర్, మండల రాజు, మేరుగు రమేష్, గుజరాతి శివకుమార్, కందగట్ల వెంకటేశ్వర్లు, తెమడ హరిబాబు, ఎనగాండ్ల నాగిరెడ్డి, జంపాల సోమయ్య పాల్గొన్నారు.

# పేకాట రాయుళ్లపై కేసు నమోదు

**వరంగల్ వాయిస్, నర్సంపేట :** పట్టణంలోని శాంతినగర్ లో గల మనిముద్దల సంపత్ ఇంట్లో కొంతమంది వ్యక్తులు డబ్బులు పెట్టి పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు నర్సంపేట సీఐ డి.రమణ మూర్తి, ఎస్సై రవికుమార్ తన సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి చూడగా అక్కడ నలుగురు వ్యక్తులు డబ్బులు పెట్టి పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. పట్టుబడిన వారి వివరాలు కార్తాల శ్రీనివాస్, మనిముద్దల సంపత్, వేల్పుల వీరభద్ర స్వామి, బొంత రాజు వద్ద రూ.2850 నగదు,ప్లే కార్డులను స్వాధీన పరుచుకొని ఈ నలుగురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా నర్సంపేట సీఐ రమణ మూర్తి మాట్లాడుతూ పట్టణంలో ఎవరైనా పేకాట, గంజాయి వంటి చట్ట వ్యతిరేకమైన పనులు చేసినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రేపటి నుంచి ఒంటి పూట బడులు

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** రాష్ట్రంలో బుధవారం నుంచి జరుగుతున్న సమగ్ర సర్వేలో ప్రభుత్వ పాఠశాలల్లోని సెకండరీ గ్రేడ్ టీచర్లు భాగస్వాములు కానున్నారు. వీరికి సోమవారం శిక్షణనిచ్చారు. సర్వే పూర్తయ్యే వరకు ప్రభుత్వ ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తరగతులు నిర్వహించిన అనంతరం విద్యార్థుల మధ్యాహ్న భోజన కార్యక్రమం పూర్తయిన పాఠశాలలు తాళం వేసి టీచర్లు సర్వేలో పాల్గొంటారు. ఈ బుధవారం నుంచి ఈ నెల 22 వరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఒక్కపూట మాత్రమే పనిచేస్తాయని విద్యాశాఖాధికారులు తెలిపారు.

# సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతం చేయాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు నడికూడ మండల ప్రజలందరూ సహకరించి విజయవంతం చేయాలని నడికూడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ కోరారు. నడికూడ మండల కేంద్రంలో మంగళవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు నడికూడ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాళ్ల నవీన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. ఈ నెల 6 నుంచి మండలంలోని అన్ని గ్రామాలలో ప్రతి కుటుంబం పూర్తి వివరాలను సర్వే చేయడానికి అధికారులు వస్తున్నారని వారందరికీ మండల ప్రజలు సహకరించి మీ కుటుంబ సభ్యుల వివరాలను అందజేయాలని కోరారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వనపర్తి నవీన్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పం కుమారస్వామి గ్రామ ప్రధాన కార్యదర్శి జీల శ్రీనివాస్, గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపెల్లి యుగేందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రావుల సురేష్, దుప్పటి సదానందం, జీల కుమార్, నీరటి రజిత, అప్పం రేణుక, బూత్ సభ్యులు దుప్పటి అనిల్, అల్లూరు బాబు, నీరటి రాములు, అట్టెం బాబు, బుర్ర సరేష్, జంగిలి శ్రీకాంత్, జంగిల్ పరుశురాం, దుప్పటి మల్లేష్, అల్లూరి బాబు, కాకి బద్రి పాల్గొన్నారు.

# ఎస్ బీఐ నూతన శాఖ ప్రారంభం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని ఎస్ బీఐ బ్యాంక్ బ్రాంచ్ ను మంగళవారం చీఫ్ జనరల్ మేనేజర్ (హైదరాబాద్ సర్కిల్ ) రాజేష్ కుమార్ ప్రారంభించారు. అనంతరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన చీఫ్ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ ఫోర్ట్ రోడ్డులో నూతన ఎస్ బీఐ శాఖను ప్రారంభించామని, మొత్తం వరంగల్ ఉమ్మడి జిల్లాలో 186 శాఖలతో సేవలందిస్తున్నామని తెలిపారు. వరంగల్ జిల్లా 49 శాఖలు సేవలందిస్తున్నాయని పేర్కొన్నారు. రైతు రుణాలతో పాటు ముద్ర లోన్స్ అందిస్తున్నామన్నారు. ప్రపంచంలో 5 స్థానంలో ఎస్ బీఐ ఉందని, విశ్వకర్మ లోన్ లను కుడా అందుబాటులోకి తీసుకొని వచ్చామని తెలిపారు. సైబర్ నేరాల పెరుగుతున్న క్రమంలో ఖాతా దారులు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాల కోసం ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ 1930 ఏర్పాటు చేశామని చెప్పారు. ఖాతా దారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ప్రకటించారు. యెనో ద్వారా యూపీఐ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు.

# భక్తి శ్రద్ధలతో నాగుల చవితి

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని గాయత్రీ మహా దేవాలయంలో మహిళలు పెద్దఎత్తున ఆలయానికి తరలివచ్చి నాగేంద్ర స్వామికి పాలు, పూలు పంచామృతాలు సమర్పించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నాగేంద్ర స్వామి వారి పాల రాతి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళలు బారులు తీరి అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కలను చెల్లించుకున్నారు. నాగేంద్ర స్వామి వారికి పంచామృత అభిషేకాలు, కుంకుమ పూజలు, పాలు, పూలతో పాటు ప్రత్యేక నేవేద్యాలు సమర్పించి దీపారాధన చేసి, తులసిమాతను కొలిచి భక్తులు తమ భక్తి ప్రవత్తులను చాటుకున్నారు. నాగుల చవితి రోజు స్వామి వారికి పాలు పోస్తే చేసిన పాపాలు తొలగి పోవడమే కాకుండా కోరిన కోరికలు నెరవేరి సౌభాగ్యవంతులవుతారని భక్తుల విశ్వాసం. ఆలయ



సిబ్బంది భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులందరికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయార్చకులు సిద్ధేశ్వరశర్మ చారి, భక్తురాలు అరుణ పాల్గొన్నారు.

## ఘనంగా నాగుల చవితి వేడుకలు



**వరంగల్ వాయిస్, దామెర :** మండల కేంద్రంలోని ఊరుగొండ గ్రామంలోని నాగేంద్రుని దేవాలయం వద్ద మంగళవారం భక్తులు నాగుల చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలలో పాము పుట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి నైవేద్యంగా సమర్పించారు. ఉపవాస దీక్షలు ఆచరించిన మహిళలు పాము పుట్ట వద్ద తమ మొక్కులను చెల్లించుకున్నారు. అందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని నాగ దేవతను వేడుకున్నారు.

## శాయంపేటలో..



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని అతి పురాతనమైన ఆరు శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో ఉన్న శ్రీ నాగేంద్ర స్వామి గుడిలో నాగుల చవితి వేడుకలు వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం మంగళవారం ఉదయం అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి నాగదేవతల విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి రాజమణి దంపతులు పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పుట్టలో పాలు పోసి భక్తిశ్రద్ధలతో నాగదేవతలను తమ కోరికలు నెరవేర్చాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో భాషని రమేష్, ధనలక్ష్మి, గణేష్, చంద్రమౌళి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నాగ దేవతలకు పూజలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నాగుల చవితి సందర్భంగా 40వ డివిజన్ లోని ఉప్పరోనికుంట వద్ద మంకి ఫుడ్ కోర్ట్ లో ఉన్న పుట్టలో డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి మహానగర పాలక సంస్థ హార్టికల్చర్ ఆఫీసర్ రమేష్ దంపతులు పాలు పోసి నాగదేవతలకు పూజలు చేశారు. ఈ ప్రాంతంలోని ప్రజలు పుట్టలో పాలు పోసి నైవేద్యం, పూలు, పండ్లు సమర్పించి పుట్ట చుట్టూ ప్రదర్శనలు చేశారు. గతంలో ఈ పుట్టలో పాలు పోసిన వారికి వారు కోరుకున్న కోరికెలు నెరవేరడం వలన మళ్లీ నాగుల చవితి రోజున పుట్టను దర్శించుకొని పుట్టలో పాలు పోయడం జరుగుతుందని భక్తులు తెలిపారు. స్థానిక భక్తులు ఉల్లి కవిత, పొంగులేటి కవిత, పోతుల స్వప్న, కొండ్రు ధనలక్ష్మి, కత్తెరపెల్లి రాజ్యలక్ష్మి, జక్కోజు పద్మ, పోతుల రామ్, ఆడుప ఏకదర్శనంలు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్ లో 20 మందికి జరిమాన

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడిన ఇద్దరు వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం రూ.2000 జరిమానా విధించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో 20 మందికి రూ.25,400 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కే.రామకృష్ణ తెలిపారు.

## ఎయిడ్స్ పై ఆశా కార్యకర్తలకు అవగాహన



**వరంగల్ వాయిస్, కాటారం :** హెచ్ఐవీ ఎయిడ్స్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని మహాదేవపూర్ ఐసీటీసీ కౌన్సిలర్ గాదే రమేష్ అన్నారు. మంగళవారం ఆశా డే సందర్భంగా కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాటారం పీహెచ్ సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ గాదె రమేష్ అవగాహన కల్పించారు. ప్రతి గర్భిణీ స్త్రీని హెచ్ఐవీ పరీక్షలు చేయించాలని సూచించారు. సుఖ రోగాలు, టీబీ కలిగి ఉన్న వారికి తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించాలని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హెచ్ఐవీ ఎయిడ్స్ బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తెలుసుకొని మసులుకోవడమే అసలైన మందు అని అన్నారు. పాజిటివ్ వ్యక్తులను ఆదరించాలని సూచించారు. సక్రమంగా ఏఆర్టీ మందులు వాడుకునే విధంగా రోగులను పురమాయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ ఓ తిరుపతిరెడ్డి, సీహెచ్ఓ నిర్మల, సూపర్ వైజర్లు పద్మావతి, సరళ, టీబీ సూపర్వైజర్ రమేష్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంచి అకాడమిక్ వాతావరణం సృష్టిద్దాం

### కేయూ వీసీ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కేయూ :** మంచి అకాడమిక్ వాతావరణం సృష్టిద్దామని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం విశ్వవిద్యాలయ కమిటీ హాల్ లో హిస్టరీ, టూరిజం మేనేజ్ మెంట్ విభాగం అద్వర్యంలో నిర్వహిస్తున్న "కాకతీయ జోర్నాల్ అఫ్ హిస్టారికల్ రీసెర్చ్" 18 వ వాల్యూం, 1 వ ఇష్యును విడుదల చేశారు. విభాగం నిర్వహిస్తున్న జోర్నాల్ ను అభినందించారు. యూజీసీ కేర్ లిస్టెడ్ జోర్నాల్ లో ఉండటం వలన అధ్యాపకులకు, పరిశోధకులకు, విద్యార్థులకు చాలా ఉపయుక్తంగా ఉంటుందన్నారు. మరిన్ని అకాడమిక్ ఆక్టివిటీస్ జరగాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డితో పాటు సోషల్ సైన్సు విభాగాల డీన్ ఆచార్య టి.మనోహర్, విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్ కుమార్, విశ్రాంత ఆచార్యులు ఆచార్య కే.విజయ బాబు, డాక్టర్ ఎం. బ్రహ్మయ్య, డాక్టర్ కేవీఎస్. నరేందర్, డాక్టర్ ఎం.కే.సుమంత్, డాక్టర్.కే.నాగేశ్వర్ రావు, డాక్టర్ ఎ.కుమారస్వామి, డాక్టర్ బి. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించి యూనివర్సిటీకి పేరు తీసుకురావాలి



### ◆ కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ వెంకయ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సౌత్ జోన్ యూనివర్సిటీ లాన్ టెన్నిస్ పోటీల్లో రాణించి కాకతీయ యూనివర్సిటీకి పేరు తీసుకురావాలని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ డాక్టర్ వై.వెంకయ్య అన్నారు. మంగళవారం కిట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో అంతర్ కళాశాల కళాశాలల లాన్ టెన్నిస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని వై వెంకయ్య మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ ఔత్సాహిక క్రీడాకారులు ప్రోత్సహిస్తుందని తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు, కిట్స్ కళాశాల అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ నుంచి పలువురు క్రీడాకారులు జాతీయ, సౌత్ జోన్, ఆల్ ఇండియా యూనివర్సిటీ పోటీల్లో రాణించారని తెలిపారు. ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని గుర్తు చేశారు. కిట్స్ కళాశాల స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ లాన్ టెన్నిస్ పోటీలకు అద్భుత స్పందన ఉందని తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల పురుషుల, మహిళల విభాగంలో నుంచి దాదాపు 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేసి సౌత్ జోన్ పోటీలకు పంపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్లు వెంకటస్వామి, అఫ్జల్, కిషన్, పవన్, ఫిజికల్ డైరెక్టర్లు ప్రభాకర్ గౌడ్, కుమార్, శ్రీధర్, పెరుమాండ్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ ను ఆరోగ్య జిల్లాగా మార్చాలి

◆ డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రంగసాయిపేట, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంగెంలలో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వరంగల్ డాక్టర్ సాంబశివరావు పర్యటించి ఆశా డే కార్యక్రమాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు ప్రభుత్వం సూచించిన నిర్దేశాలకు అనుగుణంగా ఆశా కార్యకర్తల నుంచి వైద్యాధికారుల వరకు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించి, జిల్లాను ఆరోగ్య జిల్లాగా మార్చాలని సూచించారు. ప్రతి ఉద్యోగి తన ఉద్యోగ ధర్మాన్ని పాటించి సమయ భావంతో పని చేయాలని తెలిపారు. సాధారణంగా ప్రజలు మన సేవలపై ఆధారపడి ఉంటారు కాబట్టి, వారిని నిర్లక్ష్యం చేయకుండా సేవలందిస్తూ, ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ, వారిని ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా, మానసిక పరంగా ఎలాంటి సమస్య లేకుండా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మోహన్



సింగ్ మాట్లాడుతూ సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధులు, మాతా శిశు సంరక్షణ సేవలందించినప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, మనమంతా సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు రమ్య, వంశీకృష్ణ, పల్లె దవాఖాన డాక్టర్లు, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, డీపీహెచ్ఎన్ఓ జ్ఞాన సుందరి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతీ ఒక్క జర్నలిస్టు ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రతి ఒక్క జర్నలిస్టు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని వరంగల్ తూర్పు జర్నలిస్టు పరపతి సంఘం అధ్యక్షుడు కోరుకొప్పుల నరేందర్ అన్నారు. మంగళవారం వరంగల్ జర్నలిస్ట్ పరపతి సంఘం భవనంలో సంఘం ప్రధాన కార్యదర్శి బండి రవి అధ్యక్షతన జర్నలిస్టులకు పోస్టల్ ఇన్సూరెన్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కోరుకొప్పుల నరేందర్ మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం తహతహలాడే జర్నలిస్టులు తమ ఆరోగ్యాలను కూడా పణంగా పెడుతున్నారని అన్నారు. సమయానికి ఆహారం తీసుకోకుండా, నిద్ర లేకుండా గడుపుతున్నారని తెలిపారు. ఎప్పుడు ఎక్కడ ఏ సంఘటన జరిగినా వెంటనే అక్కడ జర్నలిస్టులు ప్రత్యక్షమై ఆ వార్తను ప్రపంచానికి అందిస్తున్నారని చెప్పారు. చదువు సారేడు బల్పాలు దోసెడు అన్న చందంగా సంపాదన తక్కువ సమస్యలు ఎక్కువ అన్నట్లు జర్నలిస్టుల జీవనయానం కొనసాగుతుందన్నారు. వృత్తిపరమైన, కుటుంబ, సామాజిక ,ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. కొంతమంది బయటకు చెప్పుకుంటున్నారు. కొందరు చెప్పుకోలేకపోతున్నారని అన్నారు. ఈ మధ్యకాలంలో అనేక ఘటనలను చూశామని... జర్నలిస్టులు మానసిక ఒత్తిడికి లోనై అనారోగ్యాల బారిన పడుతున్నారు. కొందరు ఈ మధ్యకాలంలో



మృత్యు వాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వరంగల్ తూర్పు జర్నలిస్ట్ సంఘం ముందుకు వచ్చి సభ్యులందరికీ మనోధైర్యాన్ని కల్పించడంతో పాటు జర్నలిస్టు కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఒక్కో సభ్యుడికి రూ.750 రూపాయలతో 15 లక్షల రూపాయల విలువైన పోస్టల్ ఇన్సూరెన్స్ చేయించడం జరిగిందన్నారు. జర్నలిస్టుల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా వరంగల్ తూర్పు జర్నలిస్ట్ సంఘం ముందుకు సాగుతుందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిస్టుల ఆధార అభిమానాలను చూరగొంటూ, అందరికీ ఆదర్శంగా నిలుస్తూ ముందుకు సాగుతుందన్నారు. సభ్యుల సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో పెరుమాండ్ల మధు, జన్ను స్వామి, వడిచెర్ల శ్రీనివాస్, దుర్గాప్రసాద్, సీనియర్ జర్నలిస్టులు గాడిపెల్లి మధు, సంగోజు రవి, కంది భరత్, మోహన్, ఇంద్రారెడ్డి పూర్ణచందర్, శంకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతిశీల భావజాల వ్యాప్తి ఉద్యమాలను ఉధృతం చేద్దాం

### ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

**వరంగల్ వాయిస్, ఇల్లందు :** దేశానికి ప్రమాదకరంగా మారుతున్న కుల, మతోన్మాద ఫాసిజాన్ని అడ్డుకునేందుకు విద్యార్థులంతా శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని ప్రగతిశీల భావ జాల వ్యాప్తోద్యమాలను ఉధృతం చేయాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పిలుపునిచ్చారు. మంగళవారం పీడీఎస్ యూ ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇల్లందు పట్టణంలో పీడీఎస్ యూ నిర్మాత జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ (జేసీఎస్) విప్లవ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నీలం రామచంద్రయ్యల సంస్మరణ సభ కాంపాటి పృథ్వీ అధ్యక్షతన జరిగింది. సభ ప్రారంభానికి ముందు వేలాదిమంది విద్యార్థులతో జగదాంబ సెంటర్ నుంచి పాత బస్టాండ్, బుగ్గ వాగు మీదుగా సభ ప్రాంగణమైన సాహితి డిగ్రీ కళాశాలకు చేరుకోవటం జరిగింది. అనంతరం విప్లవ విద్యార్థి ఉద్యమంలో అమరులైన వీరులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం, కులం, మతం, దోపిడీ, పీడన, ఆర్థిక అసమానతలు లేని సమానత్వ సమాజం స్థాపన కోసం పోరాడుతూ అమరులైన వీరుల ప్రాణత్యాగాలు వెలకట్ట లేనివని అన్నారు. విప్లవకారులు మరణించినప్పటికీ వ్యవస్థ మార్పు కోసం జరిగే పోరాటాల్లో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా జీవించే ఉంటారని తెలిపారు. 78 సంవత్సరాల భారత పార్లమెంటరీ పాలన ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేక పోయిందని, దేశంలో పేదరికం, నిరుద్యోగం, ఆకలి చావులు, అరికట్టలేక పోయారని, ప్రజలకు కనీసం అంతరాలు లేని ఉచిత విద్య, వైద్యం అందించడంలో




పూర్తిగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీడీఎస్ యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య వ్యవస్థను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పుతూ దళిత , గిరిజన, బడుగు, బలహీన, పేద వర్గాలను విద్యారంగానికి దూరం చేసే కుట్రలకు పాల్పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచారు కానీ, పెండింగ్ స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల మాటేమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థి అమరవీరుల పోరాట స్ఫూర్తితో నేటి విద్యార్థులు ఉద్యమించి శాస్త్రీయ విద్య, సమానత్వ సమాజాన్ని స్థాపించుకోవాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల అశోక్ కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుమ్మడి అనురాధ, పీఓడబ్ల్యూ మాజీ రాష్ట్ర కార్యదర్శి చంద్ర అరుణ, సీపీఐఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు నాయిని రాజు, పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ అజయ్, ఏఐపీకేఎస్ జిల్లా అధ్యక్షులు బుర్ర వెంకన్న, పీడీఎస్ యూ ఖమ్మం జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ లు పాల్గొని ప్రసంగించారు. పీడీఎస్ యూ జిల్లా నాయకులు బానోత్ నరేందర్, మునిగేల శివ, పార్థసారథి, ఎనగంటి వంశీ,

# అమర వీరులను స్మరించుకుందాం




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పేదల రాజ్యం కోసం జరిపిన పోరులో నేలకు ఒరిగిన అమర వీరులను స్మరించుకుందామని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ కేసముద్రం సముక్త మండలాల కార్యదర్శి ఫైండ్ల యాకయ్య పిలుపునిచ్చారు. భూమి, భుక్తి, దేశ విముక్తి లక్ష్యంగా ప్రారంభమైన తెలంగాణ సాయుధ పోరాటం, నక్సల్బరీ శ్రీకాకుళం, గోదావరి లోయ ప్రతిఘటన పోరాటంలో అమరులైన వారి ఆశయాల కోసం పోరాడుదామన్నారు. మహబూబాబాద్ మండలం సండ్రాల గూడెం గ్రామంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో మంగళవారం అమరవీరుల జెండాను సీనియర్ నాయకులు పెంటయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ మాస్ లైన్ కేసముద్రం సముక్త మండలాల కార్యదర్శి ఫైండ్ల యాకయ్య మాట్లాడుతూ మతం, కులం ముసుగులో పేదలపై సాగుతున్న వివక్షత దోపిడిని తరిమికొడదామని, నూతన ప్రజాస్వామ్య విప్లవం వర్ధిల్లాలని, అమెరికాక సామ్రాజ్యవాదం నశించాలని, పేదల రాజ్యం కోసం పోరులో నేలకొరిగిన భారత విప్లవ వీరులను స్మరించుకుందామన్నారు. నవంబర్ 1 నుంచి 9 వరకు గ్రామ గ్రామాన అమరవీరుల సభలను జరుపుకుందామని, అమరవీరుల ఆశయ సాధన కోసం పోరాడుదామని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు ఆలకుంట్ల కొమరయ్య, ఎస్.కె రఫీ, ప్రశాంత్, సతీష్, రమేష్, మునేష్, కృష్ణ, సంపత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఒంగోలు ఆర్ట్ ఫెస్ట్ లో "కళా విపంచి" సాగంటి మంజుల




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఒంగోలులో ఆది, సోమవారాల్లో రెండ్రోజుల పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోని చిత్రకారులను ఆహ్వానిస్తూ ప్రముఖ చిత్రకారుడు కళయజ్ఞ ఏలూరి శేషబ్రహ్మం, సృష్టి అకాడమీ తిమ్మిరి రవీంద్ర, నెస్ట్ మేకర్స్ భూపాల్ రెడ్డి సంయుక్తంగా నిర్వహించిన ఒంగోలు ఆర్ట్ ఫెస్ట్–"ప్రాచీన భారత్" ఆర్ట్ ఎగ్జిబిషన్ లో హనుమకొండకు చెందిన ప్రముఖ చిత్రకారిణి సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజుల వేసిన పేయింటింగ్ కు క్యాష్ ప్రైజ్ తో పాటు 'కళా విపంచి" అవార్డును ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్ధన్ రావు చేతుల మీదగా అందజేయడం జరిగింది. దాదాపు 150 మంది ప్రముఖ చిత్రకారులు పాల్గొనగా హనుమకొండ నుంచి బహుమతికి ఎంపికైన మంజులను కళా యజ్ఞ శేషబ్రహ్మం అభినందించి క్యాష్ ప్రైజ్ తో పాటు శాలువా జ్ఞాపిక ను అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులతో పాటు మూడు రాష్ట్రాలకు చెందిన హైపర్ రియాలిస్టిక్ చిత్రాకారులు సుబ్బు ఆర్వీ, విజయ్, అబ్దుల్ రాయ్ బోస్, పంతంగి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు తెలుగు రాష్ట్రాల నుంచి 150పైగా చిత్రకారులు పాల్గొనగా 50 మందికి క్యాష్ ప్రైజ్ లు అందించి ఘనంగా సన్మానించారు.

# విద్యార్థులకు గుర్తింపు కార్డుల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఏవీవీ పాఠశాల ఉపాధ్యాయురాలు సంధ్యారాణి పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. అకాడమిక్ కోఆర్డినేటర్ టి.వాసుదేవులు పాఠశాలకు గైర్హాజరు కాకుండా ప్రతీ రోజు హాజరైన (100 శాతం అటెండెన్స్) విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.ఎ.భుజేందర్ రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ టి.వాసుదేవులు, ఉపాధ్యాయ బృందం ఎన్.నవీన్, జి.భాగ్యలక్ష్మి, వి.రమాదేవి, జి.వీరేశలింగం, చిలుక భాస్కర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు రామప్ప విద్యార్థులు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన 68వ ఎస్ జీఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో అద్భుతమైన ప్రతిభను కనబరిచిన రామప్ప జూనియర్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ ఐలీ కరుణాకర్ గౌడ్ తెలిపారు. నవంబర్ 3 నుంచి 5 వరకు మహబూబ్ నగర్ లో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలలో కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు ఐశ్వర్య, అక్షిత్ విద్యార్థి సంధ్య పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా కరుణాకర్ గౌడ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు వివిధ అంశాలలో 34 మంది విద్యార్థులు ఎంపిక అవడం సంతోషంగా ఉందని, ఇంటర్ విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్న ఏకైక కళాశాల అని అన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులు కళాశాల యాజమాన్యానికి, ఫిజికల్ కోచ్ కమల్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ వినోద్, వైస్ ప్రిన్సిపల్ తిరుపతి, ఏవో సతీష్,జోనల్ మేనేజర్ పూర్ణచందర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## సర్వే అధికారులకు సహకరించండి

### త్రికోవెల నరసింహస్వామి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 6 నుంచి జరగబోయే కుల గణన ఎస్సీ 57 కులాలు, అలాగే తెలంగాణలోని ఇతర సంచార జాతులు, కులాలు అధికారులు సర్వేకి వచ్చినప్పుడు వారికి ప్రతి కులస్తులు వారి వారి వివరాలు నిర్భయంగా చెప్పాలని ఎస్సీ 57 ఎంబీఎస్ సీ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి త్రికోవెల నరసింహస్వామి (టీఎన్ స్వామి ) సూచించారు. ఇది ఒక మంచి అవకాశమని, కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టినటువంటి మంచి కార్యక్రమని, అందుకు తెలంగాణలో ఉన్న ఎంబీసీ 57 ఎస్సీ కులాలు, ఇతర సంచార కులస్తులు ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరిస్తూ మీ కులాన్ని నమోదు చేయించుకోలన్నారు. రానున్న కాలంలో మన పిల్లల భవిష్యత్తును, తలరాతలు మనమే మార్చాలనే ఉద్దేశంతో అనేక సందర్భాల్లో చెప్పడం జరిగిందని, అలాగే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, అందుకు ఎస్సీ 57 కులాల ప్రతి ఒక్కరు వారి వారి కులాలని నమోదు చేయించుకోవాలన్నారు.

## డీలా పడిన బీజేపీ కార్యకర్తలు

**వరంగల్ వాయిస్, గణపురం :** మండలంలోని దీటైన నాయకత్వ లేమితో బీజేపీ కార్యకర్తలు డీలా పడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఎంతో దూకుడుగా పనిచేసిన భూపాలపల్లి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిని చందుపట్ల కీర్తి రెడ్డి పత్తా లేకుండా పోవడంతో కార్యకర్తలలో ఆపదలో ఆదుకునే నాయకత్వం లేక తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు. ఈ నేపథ్యంలో మండల బీజేపీ అధ్యక్షుడు జిట్టబోయిన సాంబయ్య పార్టీ పెద్దలా సహకారం కొరవడి పార్టీ కార్యక్రమాలు నిర్వహించడంలో ఎంతో ఇబ్బందిగా మారడంతో అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఇందుకు పార్టీ అధిష్టానం స్పందించినట్లు కనబడడం లేదు. కాగా, రాష్ట్రస్థాయిలో అధికార కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను రాష్ట్ర నాయకత్వం ఎండగడుతూ కౌంటర్లు ఇస్తున్న మాదిరిగా మండలంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అలాగే ప్రభుత్వ వ్యవహారాలపై పార్టీలో నోరెత్తేవారు. కరువవడంతో పార్టీ కార్యకర్తలు అభిమానులు ఆవేదన చెందుతున్నారు. మిగతా పార్టీల కార్యకర్తల మాదిరిగా బీజేపీ కార్యకర్తలు ఇతర పార్టీల్లో చేరేందుకు ఇష్టపడరు. ప్రలోభాలకు లొంగే స్వభావం ఉండక పార్టీ అధిష్టానం పట్టించుకోకపోయినా పార్టీని పట్టుకొని ఉంటుండడం ఆ పార్టీ అదృష్టం. రాష్ట్ర నాయకత్వం ఎంతసేపు కేంద్రంలో తమ ప్రభుత్వం, ప్రధానమంత్రి మోదీ పేరు చెప్పుకొని కాలంగడుపుతుండడం తప్ప పార్టీ బలోపేతానికి ఏ మాత్రం కృషి చేయడం లేదని కార్యకర్తల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయ. గత నాయకత్వం వైఫల్యం చెందిన స్థానంలో ధీటైన నాయకత్వాన్ని ఏర్పరచి కార్యకర్తల్లో నూతన ఉత్తేజం నింపి బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ కార్యకర్తలు అధిష్టానాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## ఎంజీఎంలో నూతన ఫ్రీజ్ బాక్సులు ఏర్పాటు చేయాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎంజీఎం హాస్పిటల్ వరంగల్ మార్చురీలో ఫ్రిడ్జ్ బాక్స్ లు పనిచేయకపోవడంతో పార్థీవ దేహాలు డీకంపోస్ అవుతున్నాయని, నాణ్యంగా ఉండటం లేదని, దేహాలు చెడిపోతున్నాయని, గుర్తింపు లేని దేహాలను వైద్య విద్య నిమిత్తం మెడికల్ కాలేజీలకు అప్పగిస్తుంటే, నాణ్యత కోల్పోవడం వల్ల అవి మెడికల్ చదువులకు, శాస్త్ర పరిశోధనకు ఉపయోగపడటం లేదని నేత్ర సేకరణ నేత్రదానం చేసే సందర్భంలో కార్నియాలో కంటి పొరలు నాణ్యత లోపించడం వల్ల ట్రాన్స్ ప్లాంటేషన్ కి ఉపయోగపడటం లేదని తెలుస్తోంది. కాబట్టి, ఫ్రీజ్ బాక్స్ లను పర్మినెంట్ గా రిపేరు చేసి, లేదా కొత్త వాటిని ఏర్పాటు చేసి పార్థీవ దేహాలను గౌరవంగా కాపాడాలని తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ శాఖ ఎంజీఎం వరంగల్ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ మురళిని కోరింది. ఐసీయూలో, ఇతర వార్డులలో చికిత్స పొందుతూ మరణించిన వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, సమాచారాన్ని నర్సింగ్ ఆఫీసర్స్, వారి సిబ్బంది ఆ సమీపంలో ఉన్న ప్రాంతీయ నేత్ర



వైద్యశాల ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ నిపుణుల ముగ్గురికి సమాచారం అందించి నేత్రదానానికి సహకరించాలని ఆయనకు విన్నవించారు. తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ వరంగల్ అధ్యక్షుడు కే మల్లారెడ్డి, సలహాదారు ఏ రాజేంద్రప్రసాద్, హనుమకొండ సీనియర్ సిటిజన్ ప్రధాన కార్యదర్శి యుగేందర్ కలిసి వినతి పత్రం ఇచ్చారు.

## వైన్ షాప్ షిఫ్టింగ్ ఎప్పుడు ?




**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలో మెయిన్ రోడ్డులో నిబంధన విరుద్ధంగా నడుస్తున్న ఓ వైన్ షాప్ ను చాలా నెలల క్రింద గాంధీ నగర్ కు మార్చాలని ఎక్సైజ్ వారు ఇచ్చిన ఆదేశాలు బేఖాతర్ అయ్యాయని పలువురు ఆరోపిస్తున్నారు. జనావాసాల మధ్య ఉన్న సదరు వైన్ షాప్ కు వచ్చిన మందుబాబుల వల్ల పరిసర గృహాల వారికి ప్రశాంతత కరువైందని, న్యూసెన్స్ అవుతుందని ఎక్సైజ్ వారికి ఫిర్యాదులు అందగా వారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గాంధీనగర్ కు షాపులు మార్చాలని, అలాగే అక్కడ జాతీయ రహదారికి దూరంగా వైన్ షాప్ ను పెట్టుకోవాలని ఓనరును ఆదేశించారు. దీంతో ఆ గ్రామంలో దాని ఏర్పాటుకు కొద్దిరోజులు ప్రయత్నం చేశారు. కానీ ఎందుకో ఆ ప్రయత్నాన్ని విరమించుకొని మళ్లీ యధావిధిగా గణపురంలోనే నడుపుతున్నారు. దీనిపై గ్రామస్తుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎక్సైజ్ శాక అధికారులను మచ్చిక చేసుకోవడంతో సదర్ షాప్ షిఫ్టింగ్ ఆదేశాలు రద్దయినట్లు ఆరోపణలు వస్తుండగా వైన్ షాప్ వల్ల బాధపడుతున్న వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వైన్ షాప్ ను ఇక్కడి నుంచి వెంటనే మార్చాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## పాలకుర్తిలో కొండా లక్ష్మణ్ విగ్రహ ప్రతిష్ఠాపన స్థలం పరిశీలన



**వరంగల్ వాయిస్, పాలకుర్తి టౌన్ :** పాలకుర్తి చౌరస్తాలో త్వరలో ఏర్పాటు చేయబోతున్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్టాపన స్థలాన్ని మంగళవారం తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు వల్లకాటి రాజు కుమార్, తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు పరిశీలించారు. వారు మాట్లాడుతూ పాలకుర్తిలో అత్యధిక సంఖ్యలో పద్మశాలీలు ఉన్నారని, రాజకీయంగా వారికి అవకాశాలు ఇచ్చిన పార్టీని అక్కున చేర్చుకుంటామని, కొడకండ్లలో మినీ టెక్స్ టైల్ పార్క్ త్వరగా పూర్తి అయ్యేలా ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడారపు సుధాకర్ వారికి కాంస్య విగ్రహం, గద్దె నిర్మాణం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడారపు సుధాకర్, పద్మశాలి సంఘం మండల ప్రధాన కార్యదర్శి పెనుగొండ రమేష్, గౌరవ అధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వర్లు, పద్మశాలి సంఘం టౌన్ అధ్యక్షులు చిలుకమారి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చిదురాల మార్కండేయ, పాలకుర్తి మాజీ ఉప సర్పంచ్ కాటబట్టిని రమేష్, విగ్రహ కమిటీ ప్రధాన కార్యదర్శి చిలుకమారి సోమేశ్వర్, చిలుకమారి ఉప్పలయ్య, చిదురాల దేవేందర్, వొల్లాల గౌరయ్య, వైట్ల శ్రీహరి, మార్గం సారంగపాణి, మార్గం సతీష్, పొన్నాల వీరయ్యలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసిన బీసీ సంఘాల నేతలు

**వరంగల్ వాయిస్, కాటారం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం డివిజన్ కు చెందిన బీసీ సంఘ నేతలు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను హైద్రాబాద్ లో కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేయతలపెట్టిన బీసీ కులగణనలో తలెత్తే ఇబ్బందులను, బీసీ సమస్యలను మల్లన్న దృష్టికి తీసుకెళ్లారు. గతంలో అన్ని బీసీ సంఘాలు 'రెడ్డి గాండ్ల' కులస్థులు బీసీలు కాదని చేసిన పోరాటంలో భాగంగా, ఆనాటి ప్రభుత్వం వారు బీసీలు కాదని 2002 ఎన్ సీ బీ సీ నం ఏ పీ 2002 , జీ ఓ నంబర్ 320/సీ 2/2007, 2.8.2010 బీసీ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ దాల్వా సుబ్రమణ్యం ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారంగా రెడ్డి గాండ్ల కులస్థులు బీసీలు కాదని, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారని, వారికి బీసీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వద్దని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. గతంలో ప్రభుత్వం రద్దు చేసినప్పటికీ వారు ప్రస్తుతం జరుగుతున్న కులగణనలో మళ్లీ బీసీలుగా గుర్తించబడాలనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్, వరంగల్, అదిలాబాద్ జిల్లాలో నివసిస్తున్న రెడ్డి గాండ్ల కులస్థులు బీసీలు కాదని అన్ని బీసీ కుల సంఘాలు ఐక్యతా రాగంతో ముందుకు వచ్చి చేస్తున్న పోరాటానికి బీసీ కులాల ఆపద్బాంధవుడు, పేదల ఆశాజ్యోతి,



పట్టభద్రుల శాసనమండలి సభ్యులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలువడంతో అతను సానుకూలంగా స్పందించి, బీసీ కులాల పక్షపాతిగా న్యాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం కాటారం సబ్ డివిజన్ అధ్యక్షులు నిడిగొండ మైనర్ బాబు, కుమ్మరి సంఘం నాయకులు సముద్రాల తిరుపతి, నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు విజయగిరి సమ్మయ్య, ముదిరాజ్ సంఘం నాయకులు గడ్డం స్వామి, యాదవ సంఘం నాయకులు ఆత్మకూరి స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# రకుల్ ప్రీత్ పై దారుణమైన ట్రోలింగ్

రకుల్ ప్రీత్ సింగ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. కన్నడ మూవీ ‘గిల్లి’తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. తెలుగులో తొలిసారిగా ‘కెరటం’లో నటించింది. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ మూవీతో మంచి గుర్తింపును సాధించింది. ఆ తర్వాత సూపర్ స్టార్ మహేశ్‌బాబు, మోగా హీరో రామ్‌చరణ్, యంగ్ టైగర్ ఎన్టీఆర్ సినిమాల్లో అవకాశాలను దక్కించుకొని.. తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో అగ్ర హీరోయిన్‌గా ఎదిగింది. ప్రస్తుతం టాలీవుడ్‌కు దూరమైంది. చివరగా తెలుగులో కొండపొలం మూవీలో నటించింది. ఆ తర్వాత బాలీవుడ్‌లో బిజీగా మారింది. పెళ్లయిన బాలీవుడ్‌లో సినిమాలు చేస్తూ వస్తున్నది. అయితే, ప్రస్తుతం సోషల్ మీడియాలో రకుల్ ప్రీత్ సింగ్‌పై ట్రోలింగ్ జరుగుతున్నది. దీపావళి పండుగ ఫైర్ క్రాకర్స్ గురించి చేసిన వ్యాఖ్యలను పలువురు సోషల్ మీడియాలో ట్రెండిరగ్ చేస్తున్నారు. ఇంటర్వ్యూలో ఓ ప్రశ్నకు రకుల్ బదులిస్తూ.. ‘దీపావళికి అంతా ఫైర్‌కాకర్స్ కాలుస్తుంటారు. చిన్నప్పుడు దీపావళి పండుగ సమయంలో మా పాప రూ.500 నోట్ ఇచ్చాడు. ఇప్పుడు రూ.500 ఎందుకిస్తున్నారు? అని అడిగాను. ఈ డబ్బుతోనే కదా నువ్వు ఫైర్‌కాకర్స్ కొని కాలుస్తావు. దాంతో ఎంత కాలుష్యమో తెలుసా? అని ప్రశ్నించారు. అదే డబ్బును అవసరం ఉన్న వారికి పేదవారికి ఇవ్వొచ్చని.. లేకపోతే చాక్‌లెట్స్, ఇంకా ఏమైనా కొని ఇవ్వచ్చని చెప్పారు. ఆయన చెప్పింది నిజమేనని అనిపించిందని, ఆ సమయంలో 5వ తరగతి చదువుతున్నాను. అప్పటి ఇప్పటి వరకు మళ్లీ బాణాసంచా కాల్చలేదు’ అంటూ రకుల్ వివరించింది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. పలువురు ఆమెపై ట్రోల్ చేస్తున్నారు. ఓ యూజర్ ఖరీదైన బట్టలు ఎందుకు ధరిస్తున్నారు ? అదే డబ్బును పేదలకు దానం చేస్తారా? అని ఒకరు ప్రశ్నించారు. మరొకరు చికెన్ తినే సమయంలో నోట్లు కూడా తింటారా? మరో యూజర్ కామెంట్ చేశాడు. ‘దేవుడికి ధన్యవాదాలు. నా తల్లిదండ్రులు ఇలా కాదు. నా బాల్యాన్ని ఎంజాయ్ చేసేందుకు అనుమతించారు. మంచి చెడులకు మధ్య తేడాను కూడా నేర్పించారు’ మరో నెటిజన్ అంటూ స్పందించాడు.


# తలైవా కూలీ, ఖైదీ2 అప్‌డేట్



2025 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు కూలీ

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ ఇటీవలే వెట్టైయాన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడని తెలిసిందే. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. ఇక అభిమానులు, మూవీ లవర్స్ ఫోకస్ అంతా కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో నటిస్తోన్న కూలీ పైనే ఉంది. తలైవా అభిమానుల కోసం స్టన్నింగ్ వార్త ఒకటి బయటకు వచ్చింది. కూలీ చిత్రాన్ని 2025 వేసవి కానుకగా విడుదల చేయబోతున్నారు. అంతేకాదు మరోవైపు కార్తీతో లోకేశ్ కనగరాజ్ చేయబోతున్న బ్లాక్ బస్టర్ సీక్వెల్ ఖైదీ 2 వచ్చే ఏడాది ఆగస్టు నుంచి సెట్స్‌పైకి వెళ్లనుంది. ఒకేసారి రెండు వార్తలు రావడంతో ఆనందంలో ఎగిరిగంతేస్తున్నారు మూవీ లవర్స్. కూలీ టైటిల్ టీజర్‌లో బంగారంతో డిజైన్ చేసిన ఆయుధాలు, వాచ్ చైన్లతో సూపర్ స్టార్ తలైవా చేస్తున్న స్టైలిష్ ఫైట్ సన్నివేశాలు సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. గోల్డ్ అక్రమ రవాణా నేపథ్యంలో సాగే కూలీలో సత్యరాజ్, అక్కినేని నాగార్జున, మహేంద్రన్, మంజుమ్మేల్ బాయ్స్ యాక్టర్ సౌబిన్ షాహిర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. కూలీలో రజినీకాంత్ స్మగ్లర్‌గా కనిపించబోతున్నట్టు ఇప్పటివరకు వచ్చిన రషెస్ చెప్పకనే చెబుతున్నాయి.

# జోరు తగ్గని త్రిష




‘థగ్ లైఫ్’లో బిజీబిజీ

త్రిష కథానాయికగా సినిమాల్లో అడుగుపెట్టి 20 ఏళ్లు పైనే అయింది. అయినా తన జోరు ఇప్పటికీ తగ్గలేదు. అందం, అభినయంతో ఇప్పటికీ తన క్రేజ్‌ను అలాగే మెయిన్‌టెన్ చేస్తోంది. ప్రస్తుతం మరో చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. కమల్ హాసన్ కథానాయకుడిగా దర్శకుడు మణిరత్నం తెరకెక్కిస్తున్న చిత్రం ‘థగ్ లైఫ్’ పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న చిత్రమిది. సముద్రపు దొంగల నేపథ్యంలో యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తయిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రంలో త్రిషతో ఓ పాట సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నట్లు ఇన్‌స్టా వేదికగా చిత్రబృందం వెల్లడిరచింది. ఇందులో శింబు, జోజు జార్జ్, నాజర్, గౌతమ్ కార్తిక్, పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, అభిరామి, ఐశ్వర్య లక్ష్మి కీలక పాత్రలు పోషిస్తున్నారు. రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రం త్వరలో సినీ ప్రియుల ముందుకు రానుంది. ఈ చిత్రంతోపాటు త్రిష చిరంజీవి హీరోగా నటిస్తున్న ‘విశ్వంభర’ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. వశిష్ట దర్శకత్వంలో యువి. క్రియేషన్స్ సంస్థ భారీ బడ్జెట్‌తో నిరిస్తోంది. సంక్రాంతికి విడుదల కావలసిన ఈ చిత్రం వాయిదా పడిన సంగతి తెలిసిందే.

# ఆ కామెంట్‌కు నొచ్చుకున్న సమంత

టాలీవుడ్ స్టార్ నటి సమంత గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తన అందం, అభినయంతోపాటు నటనతో కోట్లాది మంది అభిమానులను సొంతం చేసుకుంది. అనారోగ్య సమస్యల కారణంగా ఏడాదికాలంగా సినిమాలకు బ్రేక్ తీసుకున్న సామ్.. ప్రస్తుతం మళ్లీ ప్రొఫెషనల్ లైఫ్‌లో బిజీ అవుతోంది. తాను నటించిన ‘సిటాడెల్: హనీ బన్నీ’ సిరీస్‌తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. ఈ సిరీస్ ప్రొమోషన్స్‌లో పాల్గొంటోంది.

ఇందులో భాగంగా సోమవారం తన ఇన్‌స్టా వేదికగా ఆస్క్ మీ ఎనీ థింగ్ సెషన్ నిర్వహించింది. అభిమానులతో సరదాగా కాసేపు ముచ్చటించింది. అభిమానులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చింది. ఈ క్రమంలో ఓ నెటిజన్ సమంతను ఆసక్తికర ప్రశ్న వేశారు. కాస్త బరువు పెరగాలని విజ్ఞప్తి చేశారు. ‘ప్లీజ్ మేడం, కాస్త బరువు పెరగండి’ అంటూ నమస్కరిస్తున్న ఎమోజీతో కామెంట్ పెట్టారు. సదరు అభిమాని రిక్వెస్ట్‌పై సమంత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ‘మళ్ళీ బరువు గురించే ప్రశ్న. మయోసైటిస్ కారణంగా వైద్యుల సూచనల మేరకు ప్రస్తుతం నేను చాలా స్ట్రిక్ట్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్‌లో ఉన్నాను. అందువల్లే నా బరువు ఇలా ఉంది. నా ఆరోగ్య పరిస్థితుల వల్ల నేను ఇలానే ఉండాలి. ఇతరులను జడ్జ్ చేయడం ఆపండి. మనం 2024లో ఉన్నాం. దయచేసిన అవతలి వాళ్లను కూడా బతకనివ్వండి’ అంటూ గట్టిగా సమాధానం ఇచ్చింది. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట తెగ వైరల్ అవుతోంది.



WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

మంగళవారం, నవంబర్ 05, 2024

# త్వరలో ఎయిర్ పోర్ట్

- 2050-విజన్‌తో మాస్టర్ ప్లాన్
- జిల్లా ఇంఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- వరంగల్ అభివృద్ధిపై విస్తృత స్థాయి సమావేశం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** గొప్ప చారిత్రిక నేపథ్యం ఉన్న వరంగల్ నగర అభివృద్ధికి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 2050 జనాభాను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన మాస్టర్ ప్లాన్ తుది దశకు చేరుకుందని వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మాస్టర్ ప్లాన్‌ను విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్ డీలో వరంగల్, హనుమకొండ జిల్లాల అభివృద్ధి కార్యక్రమాలపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన మాస్టర్ ప్లాన్, వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్, భద్రకాళి టెంపుల్ అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, మెగా టెక్స్‌టైల్ పార్క్, మామునూరు ఎయిర్‌పోర్ట్, ఎకో టూరిజం తదితర అంశాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి దీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాలన్న కృతనిశ్చయంతో సీఎం ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న వరంగల్ మాస్టర్ ప్లాన్‌ను తమ ప్రభుత్వం కొలిక్కి తీసుకువచ్చిందన్నారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్‌కు అవసరమైన భూసేకరణను యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. 41 కిలోమీటర్ల పరిధి ఉన్న వరంగల్ ఔటర్ రింగ్ రోడ్డును మూడు దశల్లో చేపట్టాలని మొదటి దశలో 20 కిలో మీటర్లు, రెండో దశలో 11 కిలోమీటర్లు, మూడో దశలో 9 కిలోమీటర్లు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. హైదరాబాద్ మినహా రాష్ట్రంలో మరెక్కడా ఎయిర్‌పోర్ట్ లేనందున వరంగల్ జిల్లాలో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి సమావేశంలో పచ్చజెండా ఊపారు. వీలైనంత త్వరగా ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించి ఏడాదిలోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. 382 ఎకరాల పరిధిలో ఉన్న చారిత్రాత్మకమైన భద్రకాళి చెరువులో పేరుకుపోయిన పూడికను తీయాలని, ఇందుకు సంబంధించిన పనులను రేపటినుంచే మొదలు పెట్టాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండ చెరువును ఖాళీ చేయాలని అధికారులకు సూచించారు. ఈ చెరువు 40 శాతం గుర్రపుడెక్కతో నిండిపోయిందన్నారు. మెగా టెక్స్ టైల్ పార్క్ లో ఏర్పాటు చేసిన కంపెనీలు తప్పనిసరిగా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, శాసనసభ్యులు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కె.నాగరాజు, నాయిని రాజేందర్, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, రోడ్లు, భవనాల కార్యదర్శి హరిచందన, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారద, పి.ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖేడే, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపకురాలికి బ్రెయిన్ స్ట్రోక్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉద్యోగం పోతుందేమోననే మానసిక ఆందోళనతో బాధ పడిన అతిథి అధ్యాపకురాలు రాధా బ్రెయిన్ స్ట్రోక్ కు గురైన సంఘటన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిస్టరీ, సివిక్స్ పోస్టులో గెస్ట్ ఫ్యాకల్టీగా రాధా గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపకులుగా పలువురు గత కొంత కాలంగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా జూనియర్ లెక్చరర్ల నియామక ప్రక్రియ చేపట్టడంతో తమ ఉద్యోగం ఉంటుందో, పోతుందో అనే తీవ్రమైన మానసిక ఆందోళనకు గురైన రాధాకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. దీంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని యశోద ఆసుపత్రి తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. విషయం తెలిసుకున్న కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఉద్యోగం చేస్తే తప్ప, పూట గడవని వారి కుటుంబం సభ్యులు, ఈ విషాద ఘటనతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు.

## భక్తి శ్రద్ధలతో నాగుల చవితి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** పవిత్ర కార్తీక మాస వేల మంగళవారం నాగుల చవితి పర్వదినాన్ని మహిళలు భక్తి ప్రపత్తులతో జరుపుకున్నారు. ఉదయం నుంచే మహిళలు నాగేంద్రుని పుట్టల్లో పాలు పోసి పేజలు నిర్వహించారు. వరంగల్ నగరంలోని ఉర్సు సుభాష్ నగర్ ప్రాంతంలోనున్న నాగేశ్వర స్వామి ఆలయంలో నాగుల చవితి వేడుకలు పెద్ద ఎత్తున జరిగాయి. వేలాదిమంది మహిళలు పాల్గొని నాగేంద్రుడికి మొక్కులు చెల్లించుకున్నారు. ఇక్కడ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. హనుమకొండ బ్రాహ్మణవాడలోని నాగుల గల్లీలోని పుట్టల వద్దకు కూడా మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. నగరంలో ఎక్కడ చూసినా మహిళలు కోలాహలంగా పుట్టల వద్దకు వెళ్లే దృశ్యాలుగా దర్శనమిచ్చాయి.

## రాష్ట్రంలో మరోమారు సమగ్ర సర్వే

- రేపటి నుంచే వివరాల సేకరణ
- ఆస్తులు, అప్పులు అన్నింటిపై ఆరా
- వివరాలన్నీ గోప్యంగా కంప్యూటరీకరణకు చర్యలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వేను ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. సర్వేలో భాగంగా ఇంటింటికీ వెళ్లి మొత్తం 56 ప్రధాన ప్రశ్నలు వేస్తారు. వాటిలో కొన్నింటికి ఉప ప్రశ్నలు వేసి ప్రతి కుటుంబం నుంచి సమగ్రంగా సమాచారాన్ని సేకరించాలని ప్రభుత్వం గణకులకు నిర్దేశించింది. సర్వేలో కుటుంబ యజమాని, సభ్యుల వివరాలను నమోదు చేయడంతో పాటు కుటుంబంలోని ప్రతి ఒక్కరి ఫోన్ నంబరు, వారుచేసే వృత్తి లేదా ఉద్యోగ వివరాలను సేకరిస్తారు. ఇందులో భాగంగా ఆస్తులెన్ని.. అప్పులెన్ని.. ఆదాయమెంత.. ఇంట్లో ఎంతమంది ఉంటారు.. ఎవరైనా విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లారా.. ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారా.. ఇలా మొత్తం 75 రకాల ప్రశ్నలతో గణకులు వివరాలను సేకరించేలా ప్రశ్నావళిని రూపొందించారు. ఉన్నత చదువు లేదా ఉద్యోగం, వ్యాపారం, పెళ్లి లేదా ఇతర అవసరాలకు వెళ్లారా.. అని కుటుంబ యజమానిని గణకులు అడుగుతారు. విదేశాల్లో యూకే, అమెరికా, గల్ఫ్, ఆస్ట్రేలియా, కెనడాలతో పాటు ఐరోపా దేశాలకు వెళ్లినట్లు చెబితే ఒక్కో దేశానికి ఒక ప్రత్యేక కోడ్ నమోదు చేస్తారు. మరే దేశానికి వెళ్లినా ఇతర దేశం అనే కోడ్ నమోదు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ నుంచి ఎందరు వలస వెళ్లారు.. ఏ కారణంతో బయటకు వెళ్లారనే సమగ్ర సమాచారం సేకరించడానికి ఈ ప్రశ్నలు రూపొందించినట్లు తెలుస్తోంది. ప్రజలు తీసుకున్న రుణాలపై ప్రత్యేకంగా మూడు ప్రశ్నలు అడుగుతారు. గత ఐదేళ్లలో ఏమైనా అప్పులు తీసుకున్నారా.. ఎందుకు తీసుకున్నారు.. ఎక్కడి నుంచి రుణం పొందారు.. అనే ప్రశ్నలను ప్రతి కుటుంబాన్ని అడగాలని నిర్ణయించారు. బ్యాంకులు, స్వయంసహాయక సంఘాల నుంచే కాకుండా వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకున్నారా అనే వివరాలను కూడా చెప్పాలి. కుటుంబ సభ్యులందరి స్థిర, చరాస్తుల వివరాలన్నీ చెప్పాలి. చరాస్తుల వివరాలను వేర్వేరుగా నమోదు చేస్తారు. వీటిలో బైకు, స్కూటర్, సొంత అవసరాలకు వాడే కారు, కిరాయికి తిప్పుతున్న కారు వంటివి ఉన్నాయా? వాషింగ్ మిషన్, ఫ్రిజ్, ఏసీ, టీవీ, స్మార్ట్‌ఫోన్ ఇలా మొత్తం 18 రకాల చరాస్తుల వివరాలన్నీ చెప్పాలి. ఒక కుటుంబంలోని సభ్యులందరికీ కలిపి ఇవన్నీ ఎన్ని ఉన్నాయి.. వాటి విలువ ఎంత అనేది తెలపాలి. మీ ఇల్లు ఎన్ని గజాల్లో.. ఏ ప్రాంతంలో ఉంది? ఇంటిలో ఉన్న మొత్తం గదులెన్ని.. బాత్‌రూం, మరుగుదొడ్డి ఉన్నాయా ఇలాంటి వివరాలన్నీ చెప్పాలి. మీకు ఎంత భూమి, ఎన్ని ఎకరాల్లో ఉంది.. అది పట్టా భూమా? లేదా ప్రభుత్వం ఇచ్చిన ఎసైన్డ్ లేదా పట్టాలేని అటవీ భూమా.. వంటి వివరాలు కూడా సేకరిస్తారు. గత ఐదేళ్లలో ఏమైనా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారా? ఆ పథకాల పేర్లు ఏమిటి? వంటి వివరాలు సేకరిస్తారు. కుటుంబంలో ఎవరైనా ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారా.. ఎన్నికైతే రిజర్వేషన్‌లోనా, ఎన్ని పర్యాయాలు అనేది చెప్పాలి. రాష్ట్రపతి, ప్రధాని తప్ప మిగతా ఏ హోదాలో ప్రజాప్రతినిధిగా పనిచేసినా వివరాలు చెప్పాలి. వార్డు సభ్యుడి నుంచి కేంద్రమంత్రి, గవర్నర్, సీఎం దాకా ఏ పదవి పొందినా సరే నమోదు చేయించాలి. సర్వే సమయంలో గణకులు కుటుంబాల నుంచి స్పష్టమైన సమాచారాన్ని తీసుకోవాలి. ప్రతి ఇంట్లో నివసించే కుటుంబసభ్యుల సంఖ్య తీసుకోవాలి. సర్వే ఫారంలో ఇంటి నంబరు, యజమాని పేరు వంటి వివరాలు నమోదు చేయాలి. సర్వే పూర్తయిన ఇంటిగోడపై స్టిక్కర్ అతికించాలి. సర్వే చేసిన తర్వాత ఫారాల్లో నమోదు చేసిన వివరాలను కంప్యూటర్ లో నిక్షిప్తం చేయాలి. ఈ ప్రక్రియ చాలా కీలకం. డేటాఎంట్రీ సమర్థంగా నిర్వహిస్తేనే విశ్లేషణ కచ్చితత్వం సాధిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రణాళికశాఖ జిల్లా, మండలాల్లో అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించి, వారికి శిక్షణ పూర్తిచేసింది. ప్రతిరోజూ గణకులు తీసుకువచ్చిన వివరాల్ని నమోదు చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఆపరేటర్లు నమోదు చేస్తున్న వివరాలను సూపర్‌వైజర్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు. సర్వే సమయంలో కుటుంబం నుంచి తీసుకున్న సమాచారం విషయంలో గోప్యత పాటించాలని ప్రభుత్వం స్పష్టంగా ఆదేశించింది. ఈ విషయాన్ని గణకులు ముందుగానే యజమానికి వివరిస్తారు. ఎక్కడా ఈ సమాచారం బయటపెట్టరని హామీ ఇస్తారు. ఫారంలోని వివరాలన్నీ నింపిన తర్వాత వాటిని జాగ్రత్తగా భద్రపరుస్తారు. గణకులు వివరాలను డేటా ఎంట్రీ కేంద్రంలోని ఆపరేటర్‌కు ఇచ్చి వాటిని పూర్తిచేయిస్తారు. ఆ సమయంలోనూ ఫారాలను గోప్యంగా ఉంచడంతో పాటు ఆ డేటాను ఇతరులతో పంచుకోకుండా జాగ్రత్త వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. రోజువారీ నిర్వహించిన సర్వే వివరాలు, పురోగతిని సాయంత్రం 6 గంటల్లోపు ప్రణాళికశాఖకు పంపించాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి అవసరమైన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలు మెరుగు



పరిచేందుకు, అన్నివర్గాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపింది. ఈ సర్వేకు ప్రణాళికశాఖ నోడల్ విభాగంగా వ్యవహరిస్తోంది. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ సర్వే జరగనుంది. జిల్లా, మండల నోడల్ అధికారులు.. ఎన్యూమరేషన్ బ్లాక్(ఈబీ)ల గుర్తింపు, గణకుల నియామకం, ఇళ్ల జాబితా, డేటా ఎంట్రీతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాల్సి ఉంటుంది. సెన్సెస్ డైరెక్టరేట్ నుంచి ఈబీ మ్యాపులు తీసుకోవడం, లేనిప్రాంతాల్లో కొత్తవాటిని రూపొందించాల్సి ఉంటుంది. దాదాపు 80 వేల మంది ఉద్యోగులు సర్వేలో పాల్గొంటారు. వీరిలో విద్యాశాఖ నుంచి 48,229 మంది ఉంటారు. ఉపాధ్యాయులే కాకుండా ఇతర కేటగిరీల ఉద్యోగులను సైతం వీలును బట్టి సర్వేకు వినియోగిస్తారు. సర్వే చేయడానికి ఇళ్లను ఈబీలుగా విభజిస్తారు. ఒక గ్రామంలో కనీసం 175 కుటుంబాలుంటే మొత్తంగా దాన్ని ఒకే ఈబీగా నిర్ణయించి ఒక గణకుడికి అప్పగిస్తారు. అంతకన్నా ఎక్కువ కుటుంబాలుంటే వాటిని చిన్న యూనిట్లుగా.. కనీసం ఒక్కో ఈబీలో 150 ఇళ్లు ఉండేలా విభజించి గణకులను నియమించి సర్వేను సకాలంలో పూర్తిచేస్తారు. ఈ నెలాఖరుకల్లా సర్వే పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com